
సాక్షి బాపట్ల

మంగళవారం । 28 । నవంబర్ । 2023



మహాకుంభాభిషేకం ప్రారంభం

పొన్నూరు: సాక్షి భావనారాయణస్వామి గుడిలో మహా కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కిలారి రోశయ్య దంపతులు పాల్గొన్నారు.



హంసలదీవి తీరానికి నాగశిలలు

కోడూరు: హంసలదీవి సాగరతీరానికి నాగశిలలు, నవగ్రహమూర్తుల విగ్రహాలు సోమవారం కొట్టుకువచ్చాయి. వీటికి భక్తులు పూజలు చేశారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



కర్లపాలెం: కార్తిక పౌర్ణమి సందర్భంగా తుమ్మలపల్లి గ్రామం అడవిలో ఉన్న అభయాంజనేయ స్వామికి సోమవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

న్యూస్‌రీల్

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): గుంటూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయగడ్–గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ రైలు, గుటూరు–రాయగడ్(17233) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–సికింద్రాబాద్(17015) ఎక్స్‌ప్రెస్‌లను డిసెంబర్ 4వ తేదీన రద్దు చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్–భువనేశ్వర్(17016), హౌరా–చెన్నై సెంట్రల్(12839), చెన్నై సెంట్రల్–హౌరా(12840), వాస్కోడిగామా–షాలీమార్ (18048) ఎక్స్‌ప్రెస్ రైళ్లను డిసెంబర్ 3వ తేదీన రద్దు చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో ఈనెల 29, 30వ తేదీల్లో 31వ రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023 నిర్వహించనున్నట్లు రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి డాక్టర్ వై.అపర్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ టెక్నాలజీ కమ్యూనికేషన్స్, రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి(అప్‌కాస్ట్), పాఠశాల విద్యాశాఖ, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కందుకూరుకు చెందిన సీకే దాస్ అకాడమి, చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కోనేరు లక్ష్మయ్య, ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ల సహకారంతో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), పలువురు ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

యార్డుకు 35,423 బస్తాల మిర్చి రాక




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 35,423 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 34,308 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,420 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 1,539, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,765, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 839.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి రోజూ నుంచి 1,824 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పోటీ పరీక్షలకు పుస్తకాలు సిద్ధం చేయండి



గుంటూరుఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గ్రూప్–1, 2 నోటిఫికేషన్లు విడుదల చేయనున్న దృష్ట్యా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన ప్రామాణిక పుస్తకాలను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన జేసీ రాజకుమారి అన్ని విభాగాలను పరిశీలించారు. పోటీ పరీక్షల విభాగంలో నిరుద్యోగులతో మాట్లాడి, వారికి ఎటువంటి స్టడీ మెటీరియల్, ప్రామాణిక పుస్తకాలు అవసరమనే విషయాన్ని తెలుసుకున్నారు. అన్ని రకాల పుస్తకాలు, గ్రంథాలను సిద్ధంగా ఉంచి, పాఠకులకు అవసరమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయ సెస్ చెల్లించేలా స్థానిక సంస్థల అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఆమె వెంట జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి కె.రూన్సీలక్ష్మి ఉన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న సూర్యలంక తీరం

ఉప్పొంగిన భక్తి కెరటం

కడలి కెరటాల స్పర్శతో కేరింతలు కొట్టే కడలి తీరం.. కార్తిక పున్నమి వేళ పోటెత్తిన భక్తి కెరటాలతో ఉప్పొంగింది. వేకువ వేళ తొలిపొద్దు వెచ్చని కిరణాలతో బంగారు వర్ణమేసే సంద్రం.. సోమవారం నాడు భక్తులు దిద్దిన కుంకుమ రేఖలతో సిందూరమై మెరిసిపోయింది. ఉవ్వెత్తున ఎగిసే కెరటాల ఘోష.. హరోం హర అంటూ భక్తులు పలికిన శివనామ స్మరణలో కలిసిపోయింది. పర్యాటకుల ఆనందాల సవ్వడితో సందడి చేసే సూర్యలంక తీరం.. భక్తులు పట్టిన హారతి అందుకుని తేజోమయ కాంతితో దేదీప్యమానంగా వెలుగొందింది. – బాపట్ల అర్బన్

సూర్యలంక తీరంలో కార్తిక సందడి

- లక్షమంది పైగా సముద్రస్నానం
- భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- గంగా హారతి ఇచ్చిన ఎమ్మెల్యే కోన దంపతులు
- అన్నదానం ఏర్పాటు చేసిన వివిధ సంఘాల ప్రతినిధులు



గంగాహారతి ఇస్తున్న ఎమ్మెల్యే కోన దంపతులు

శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం సముద్ర స్నానం కోసం భక్తులు తరలివచ్చారు. జిల్లాలోని సూర్యలంక, రామాపురం ఓడరేవు, నిజాంపట్నం తీరాలకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు సముద్ర స్నానమాచారించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేశారు. సూర్యలంక తీరంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం వేకువజామునే గంగా హారతి ఇచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూర్యలంక సముద్రతీరం భక్తజనంతో జనసంద్రంగా మారింది.

వైద్య శిబిరాలు..

తీర ప్రాంతానికి వచ్చే భక్తులకు వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. అన్ని బీచుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచారు. ఎక్కడ తాగునీటికి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గుడారాలు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

తీరం పరిశుభ్రం..

పుణ్య స్నానాలు కోసం వచ్చే భక్తుల తాకిడితో తీరం అపరిశుభ్రం కాకుండా ప్రత్యేకంగా పారిశుద్ధ్య సిబ్బంది నియమించడంతో తీరం పరిశుభ్రంగా మారింది. సూర్యలంక తీరంలో బాపట్ల మున్సిపాలిటీ నుంచి వందమంది పారిశుద్ధ్య కార్మికులను నియమించారు.

ప్రత్యేక బస్సులు..

సూర్యలంక సముద్ర తీరానికి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులు నడిపింది. గుంటూరుతో పాటు బాపట్ల పాత బస్టాండ్ రైల్వేస్టేషన్‌ల నుంచి బస్సులు నడిపారు. వివిధ సంఘాల ప్రతినిధులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారి గంధం రవీందర్ మత్స్య శాఖ జేడీ సురేష్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి డి.రాంబాబు, బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, తహసీల్దార్ సంధ్యారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పులి శరత్ బాబు, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, అధికారులు పర్యవేక్షించారు.

తీరంలో పటిష్ట బందోబస్తు



తీరంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ టి.వెంకటేశులు

బాపట్లటౌన్: కార్తిక పౌర్ణమి సందర్భంగా సూర్యలంక తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. సోమవారం తెల్లవారుజామున కార్తీక స్నానాలు ప్రారంభమైనప్పటి నుంచి సాయంత్రం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అధికార యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహించారు. బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు తీరంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, వాహనాల రాకపోకలకు ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా గట్టి చర్యలు చేపట్టారు. తీరం వెంబడి ఉన్న వాచ్‌టవర్ పై నుంచి పర్యాటకులను గమనిస్తూ ఎవరైనా సముద్రంలోకి లోపలికి వెళ్తున్నట్లు కనిపిస్తే వెంటనే అప్రమత్తమై ఆయా ప్రాంతాల్లో నియమించిన పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను అప్రమత్తం చేస్తూ తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. సముద్రంలో మహిళ మునిగిపోవడాన్ని గమనించి వెంటనే గజ ఈతగాళ్ల సహాయంతో తీరానికి చేర్చారు.

బోగస్ ఓట్లు తొలగించాలి

జేసీకి ఆమంచి ఫిర్యాదు



మాట్లాడుతున్న ఆమంచి

బాపట్ల: పర్చూరు నియోజకవర్గంలో దొంగ ఓట్లు తొలగించాలని ఆరునెలల క్రితం ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ధ్వజమెత్తారు. ఈఏడాది జూలై 20వతేదీ నుంచి సెప్టెంబరు 19వరకు ఓటర్ల జాబితాపై ఇంటింటికి సర్వే చేయాల్సి ఉన్నప్పటికీ ఆ పని జరగలేదన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలిసి బోగస్ ఓట్ల వివరాలను అందించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్చూరు నియోజకవర్గంలో బోగస్ ఓటర్ల వివరాలను ఆగస్టు నెలలో ఈఆర్ఓకి అందజేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం అనేక ఆలోచనలను తావిస్తోందన్నారు. దొంగ ఓట్లు ఎందుకు తొలగించలేదని బీఎల్ఓలను ప్రశ్నించగా ఈఆర్ఓ ఓట్లు తొలగించవద్దని తమకు ఆదేశించారని, ఆ కారణంతోనే ఓట్లు తొలగించటానికి వెనుకడుగు వేసినట్లు చెబుతున్నారని వివరించారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారితోపాటు సుదూరప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారి పేర్లు కూడా ఉన్నాయని చెప్పారు. స్థానికంగా నివాసం ఉండని వారి ఓట్లు తొలగించటానికి అడ్డుపడుతున్న అదృశ్యశక్తులు ఎవరనేది త్వరలోనే బయటపెడుతామని, దొంగ ఓట్లు తొలగించని అధికారులపై చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నియోజకవర్గంలో ఓట్లు తొలగిస్తున్నారని ప్రతిపక్షనాయకులు మాట్లాడటం, పచ్చ పత్రికలలో వార్తలు రాయించటం చూస్తుంటే ఆశ్చర్యానికి గురవుతున్నామన్నారు. తాను తొలగించాలని ఫిర్యాదు చేసిన ఓట్లలో ఏ ఒక్కరైనా నియోజకవర్గంలో ఉన్నట్లు చూపిస్తే ప్రతిపక్షనాయకులు చెప్పిన విధంగా చేస్తానన్నారు. 89 పోలింగ్ కేంద్రాల్లో 4482 ఓట్లు పూర్తిస్థాయిలో విచారణ చేసి తొలగించాలన్నారు. ఈఆర్ఓ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తున్నారని, అతనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మార్టూరులో ఒకే డోర్ నెంబరులో 55 ఓట్లు ఏవిధంగా ఉన్నాయని ప్రశ్నించారు. 6500 ఓట్లు వివరాలు కోసం అధికారులు చిరునామాల కోసం పోస్టుఆఫీసుల ద్వారా సమాచారం పంపిస్తే ఆ అడ్రస్సుల్లో ఎవరూ లేకపోవటంతో తిరిగి అధికారులకే చేరాయన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో విచారణ చేసి బోగస్ ఓట్లు తొలగించాలని కోరారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: బడుగు, బలహీన వర్గాల ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. సోమవారం కొత్తపేటలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు మాయమాటలు ప్రజలు విశ్వసించరని, బీసీల ద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల వెన్నుముక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యలను తీర్చాలని బీసీలు చంద్రబాబు వద్దకు వెళితే తోలు తీస్తా... తాట తీస్తా అన్నారని, చంద్రబాబును అప్పటి టీడీపీ బీసీ మంత్రులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. బీసీలు జడ్జి స్థానానికి అనర్హులని కేంద్రానికి లేఖ రాసిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు పెద్ద పీట వేస్తూ రాజ్యసభ, ఎమ్మెల్సీ, మంత్రి పదవులు కేటాయించారన్నారు. టీడీపీ హయాంలో ఒక్క రాజ్యసభ సీటు కూడా చంద్రబాబు బీసీలకు కేటాయించలేదన్నారు. ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి బీసీలపై ప్రేమ ఉన్నట్లుగా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనన్నారు. అలానే రాష్ట్రంలో ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామస్థాయి నుంచి ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

అందరికీ రాజ్యాంగ ఫలాలు

- విలువలకు ప్రాధాన్యమిస్తే ప్రలోభాలు లేని ఎన్నికలు సాధ్యమే
- ప్రభుత్వ పథకాలతో ఆర్థిక పరిపుష్టి
- టెన్త్ తర్వాత ఐదేళ్లు కష్టపడితే ఐదు తరాల భవితను మార్చవచ్చు
- గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు
- ఏఎన్‌యూలో రాజ్యాంగ దినోత్సవం



మాట్లాడుతున్న ఐజీ పాలరాజు, వేదికపై అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్ హరికిరణ్, వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ(గుంటూరు): ఈ దేశంలో మనం పొందుతున్నవన్నీ రాజ్యాంగ ఫలాలేనని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఐజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐజీ మాట్లాడుతూ మనం రాజ్యాంగాన్ని చదువుతున్నాం కానీ వ్యక్తిగత, కుటుంబ జీవితంలో వాటిని పాటించడం లేదని, అందుకే చాలా సమస్యలు వస్తున్నాయన్నారు. ఎంతో విశిష్టత ఉన్న భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. చట్టం అమలులో ధనిక, పేద, వర్గ, కుల తేడాలు చూపినంతకాలం రాజ్యాంగ లక్ష్యం నెరవేరదన్నారు. యువత విలువలకు ప్రాధాన్యమిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని, మద్యం, డబ్బు, కులం, మతం వంటి ప్రలోభాలు లేని ఎన్నికలు చూడవచ్చన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు అణగారిన వారికి ఇస్తున్న పథకాల వల్ల వారు సోమరివారవుతారని కొందరు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. 70 ఏళ్ల కాలంలో రాజ్యాంగ విలువలకు అనుగుణంగా పేదలకు అన్నీ అందితే ఇప్పుడు పథకాలు, ఉచితాలు ఇవ్వాల్సిన అవసరమే ఉండేది కాదన్నారు. పేదలకు పథకాలు అందించడం వల్ల ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందన్నారు. గతంలో జరిగిన అవినీతిని దృష్టిలో ఉంచుకునే డీబీటీ(నేరుగా లబ్ధిదారునికి చేరవేత) విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. యువకులు పదో తరగతి తర్వాత ఐదేళ్లు కష్టపడితే ఐదు తరాలను సుఖపెట్టవచ్చని స్పష్టం చేశారు. ఏపీ అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రయోజనాలు పరిరక్షించే నిర్దిష్టమైన అంశాలను అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. చాలా దేశాల్లో వ్యవస్థలు సంక్షోభానికి గురవుతున్నా మన దేశంలో ఆ పరిస్థితి రాకపోవడానికి మన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేడ్కర్ లక్ష్యాలను గుర్తెరిగి యువత రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలోకెల్లా అత్యుత్తమ అంశాలను అంబేడ్కర్ మన రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. రాజ్యాంగం గురించి తెలుసుకోని విద్యార్థులు పరిపూర్ణ పౌరులు కాలేరన్నారు. అనంతరం విద్యార్థులు, అతిథులతో వీసీ రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం అధ్యాపకులు అశోక్‌కుమార్, డాక్టర్ అబ్రహం లింకన్, సీడీసీ డీన్ కె.మధుబాబు, పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య ఉదయకుమార్, ప్రిన్సిపాల్స్ సీహెచ్ స్వరూపరాణి, సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, ప్రమీలారాణి ప్రసంగించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

స్పందన అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు

- తిరస్కరణకు గురైన వాటిని సైతం నిశితంగా పరిశీలించాలి
- కలెక్టర్ రంజిత్‌బాషా



బాధితుల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల అర్బన్: స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన పరిష్కారం చూపారు. కొన్నింటిని పరిశీలన, మరికొన్నింటిని సంబంధితశాఖ అధికారులు విచారించాలని ఆదేశించారు.

- స్పందనలో వస్తున్న అర్జీలను సమగ్రంగా విచారించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. బాధితుల సంతృప్తి స్థాయి పెరిగేలా నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. తిరస్కరణకు గురైన అర్జీలను సైతం నిశితంగా పరిశీలించి స్పష్టమైన కారణాలు చూపాలన్నారు. పంచాయతీ శాఖలో రెండు, గృహ నిర్మాణ శాఖలో రెండు, పోలీస్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖల్లో గడువు తీరినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పునరావృతం అయ్యే అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ శాఖలోనే 24 అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. చీరాల ఆర్డీఓ పరిధిలో 6 అర్జీలు, బాపట్ల పరిధిలో–9 అర్జీలు, మిగిలినవి రేపల్లె ఆర్డీఓ పరిధిలో ఉన్నాయన్నారు. వాటిని సత్వరం పరిష్కరించాలన్నారు. జె.పంగులూరు, చెరుకుపల్లి, వేటపాలెం మండలాలలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో నిర్వహించినప్పటికీ అర్జీలు పరిష్కారం కాకపోవడంపై ప్రశ్నించారు.
- వికసిత్ సంకల్ప యాత్ర జిల్లాలో జయప్రదం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలనకు త్వరలో ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారి రానున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు కార్డులు అందించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన సెక్టోరియల్ అధికారులకు త్వరలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని, సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, డీఆర్ఓ పి.వెంకటనారాయణ, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు పక్కా గృహాలు పూర్తిచేయాలి..


బాపట్ల: పక్కా గృహాల నిర్మాణాలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. నవరత్నాలు – పేదలందరికీ ఇల్లు మెగా డ్రైవ్‌పై ప్రత్యేక సమావేశం సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగింది. జగనన్న కాలనీలలో జిల్లావ్యాప్తంగా 10,736 పక్కా గృహాలు నిర్మించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. 2024 ఫిబ్రవరి 15వ తేదీలోగా నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు లక్ష్యంగా నిర్దేశించిన గృహాలలో 1,783 గృహాలు రూఫ్ దశలో ఉండగా, 8,061 గృహాలు పునాది స్థాయిలో ఉన్నాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. లక్ష్యాలు చేరుకోవడానికి డిసెంబరు ఒకటో తేదీన మండల స్థాయిలో సమీక్షలు జరగాలని, డిసెంబర్ 4 నుంచి ఆరో తేదీ వరకు సచివాలయాల స్థాయిలో సమీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మొదటి విడతలో 10 వేల గృహాలు లక్ష్యం కాగా, 13వేల గృహాలను పూర్తిచేసి లక్ష్యాలను అధిగమించామన్నారు. అదే స్ఫూర్తితో అధికారులు ముందుకు సాగాలన్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్ కొరత లేకుండా చూడాలన్నారు. గృహ నిర్మాణాలలో పునాదుల ఫిల్లింగ్ కోసం పూడికతీత దువ్వ ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. దువ్వ ఇసుక తరలింపులలో లబ్ధిదారులకు సీనరేజ్ మినహాయించాలని ఏఎంఆర్ గ్రూప్ ప్రతినిధులను కలెక్టర్ ఆదేశించారు. బ్రిక్స్ తయారీ దారులు ప్రస్తుతం ఉన్న ధరనే మూడు నెలలు కొనసాగించాలని, ధరలు పెరగకుండా చూడాలని యజమాన్యాలకు సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా ప్రతి వారం అధికారులు పక్కాగా సమీక్షలు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన రుణాలు అందిస్తే గృహాల నిర్మాణం పురోగతి ఉంటుందని అధికారులకు వివరించారు. లబ్ధిదారులను చైతన్యపరిచి పురోగతి సాధనకు అధికారులు కృషి చేయాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన సంతమాగులూరు మండలంలోని కామేపల్లి పొలాల్లో ఆదివారం రాత్రి జరగ్గా సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన రావి శ్రీరామ్మూర్తి కుమారుడు రావి వెంకట సాయికుమార్ (26) గత మూడేళ్ల నుంచి హైదరాబాద్‌లోని గ్లోబల్ లాజికల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రాజెక్టు పూర్తి చేసి వేరే కంపెనీలో ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఈనేపథ్యంలో తండ్రి శ్రీరామ్మూర్తికి ఆరోగ్యం బాగాలేకపోవటంతో హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఉద్యోగం పోవడంతో కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశారు. అప్పులు తీర్చే మార్గం లేకపోవటంతో ఆదివారం ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవటంతో తండ్రి ఫోన్ చేసినా తీయకపోవటంతో అనుమానంతో చుట్టు పక్కల గ్రామాల్లో వెతగ్గా, కామేపల్లి పొలాల్లో వెంకటసాయికుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి, చికిత్స పొందుతున్న భార్య



మృతి చెందిన రవి

కారంచేడు: ఆర్థిక ఇబ్బందులు కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. కొడుకు అనారోగ్యంతో ఉండటంతో చేసిన అప్పుల ఊబి నుంచి తేరుకోలేమనే తలంపుతో భార్యాభర్తలు ఇద్దరు ఎలుకల మందును కూల్‌డ్రింక్‌లో కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎస్ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన కనుమల రవి (52) కుటుంబ పోషణ కోసం చిన్న బడ్డీ కొట్టు పెట్టుకొని కారంచేడులో జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఒక కుమారుడు. గత కొన్నేళ్లుగా కుమారుడు కిడ్నీ సంబంధిత సమస్యతో ఇబ్బందులు పడుతుండగా అప్పట్లో చేసిన అప్పులు వడ్డీలతో కలిపి అధికమయ్యాయి. బంగారు ఆభరణాలు సైతం బ్యాంకులో ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న రవి తన భార్య మిన్నీతో కలసి ఎలుకలకు పెట్టే పేస్ట్‌ను కూల్‌డ్రింక్‌లో కలుపుకొని ఆదివారం రాత్రి తాగారు. గమనించిన ఇరుగుపొరుగువారు వీరిని చీరాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్న భార్య, భర్తలలో భర్త సోమవారం ఉదయం మృతి చెందాడు. భార్య మిన్నీని మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



క్షతగాత్రురాలు మిన్నీ నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



పర్చూరు (చినగంజాం): గుర్తు తెలియని వాహనంపై వెళుతూ ఓ మహిళ జారిపడి మృతి చెందింది. ఈఘటన సోమవారం పర్చూరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల వివరాల మేరకు.. మండలంలోని జాగర్లమూడి గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగేంద్రం (54) సోమవారం ఉదయం మందులు తీసుకునేందుకు పర్చూరు వచ్చారు. తిరుగు ప్రయాణంలో గుర్తు తెలియని వాహనంపై వెళుతూ జారి కింద పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహం కాగా వారు వేరే ప్రాంతంలో నివశిస్తున్నారు. ఆమె గ్రామంలో ఒంటరిగా నివాసముంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



మార్టూరు: జాతీయ స్థాయి కరాటే, కుంగుఫూ పోటీల్లో మార్టూరు వివేకానంద నెక్స్‌జెన్ పాఠశాల విద్యార్థులు పలు బంగారు పతకాలు సాధించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో కటా విభాగంలో హేమ కావ్య, దివ్యతేజ్, సాయి రేవంత్‌లు బంగారు పతకాలు సాధించారు. టీం కటా విభాగంలో సాయి రేవంత్ మరో బంగారు పతకం సాధించగా నవదీపిక, రక్షితలు వెండి పతకాలు, లీల, శ్రీచరణ్‌లు కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలు పతకాలు సాధించిన చిన్నారులను పాఠశాల డైరెక్టర్ ఏలూరి కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ అక్కిశెట్టి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

కట్టుదిట్టంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను కట్టుదిట్టంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగింది. కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 3వ తేదీన నిర్వహించే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లాలోని 156 పాఠశాలల నుంచి 2,742 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. 12 కేంద్రాలలో పరీక్ష జరుగుతుందని చెప్పారు. 115 మంది ఇన్విజిలేటర్లు, మూడు స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. జిరాక్స్ షాపులను మూత వేయించాలన్నారు. పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష జరిగే రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. డీఆర్‌ఓ పి.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి పీవీ రామారావు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' రిజిస్ట్రేషన్లు ప్రారంభం

బాపట్ల: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై రూపొందించిన వాల్‌పోస్టర్లను సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన విడుదల చేశారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం డిసెంబర్ 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా వ్యాప్తంగా క్రీడలు జరుగుతాయని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ప్రకటించారు. 15 సంవత్సరాలు నిండిన వారంతా క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ముందస్తుగా సచివాలయాల వద్ద లేదా వలంటీర్ల ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ ప్రసాద్, జిల్లా చీఫ్ కోచ్ కె.పాల్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు జి.రవీందర్, పి.సరోజిని, హెలా షారోన్, అనుబంధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి



అడిషనల్ ఎస్పీ పి.మహేష్‌కు సమస్యలు వివరిస్తున్న బాధితులు

జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్

బాపట్లటౌన్: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 20 మంది అర్జీదారులు అడిషనల్ ఎస్పీను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడారు. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్టపరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకోని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. అర్జీదారులను రోజులతరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అర్జీలు పునరావృతమైతే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీలను క్షుణ్ణంగా చదివి సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. పరిష్కరించని పక్షంలో సమస్య పరిష్కారం నోచుకోకపోవడానికి గల కారణాలను వెంటనే తెలియజేయాలన్నారు. స్పందన సెల్ సీఐ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

పీఓఏ అమలు పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్‌పోర్టల్

బాపట్ల అర్బన్: పీఓఏ (ప్రివెన్షన్ ఆఫ్ ఎట్రాసిటీ యాక్ట్) చట్టం, నిబంధనల అమలును ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడం కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్(https://poa.apcfss.in)ను ఏపీసీ ద్వారా అభివృద్ధి చేయడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత అధికారి జె.రాజ్ దిబోరా వెల్లడించారు. టీసీఏ పోర్టల్ ఫిర్యాదుల మాడ్యూల్‌కు వినియోగదారుల మాడ్యూల్‌ను జతచేస్తూ జిల్లాలోని ఎఫ్‌సీఏ పోర్టల్‌లో ఫిర్యాదుల మాడ్యూల్ వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు సూచించారని చెప్పారు.

పీఓఏ పోర్టల్ లక్ష్యాలు..

- ఈ పోర్టల్‌లో అఘాయిత్యాలకు గురైన బాధితులు తమ ఫిర్యాదులను ఏ విధంగానైనా తెలియజేయవచ్చు
- ఒకసారి విద్యార్థులు చేసిన ఫిర్యాదు స్వభావం ఆధారంగా సంబంధిత అధికారులకు సందేశాలు అందుతాయి
- పోలీస్ శాఖకు ఎఫ్ఎస్ఆర్, చార్జ్‌షీట్, విచారణ, మార్గదర్శకానికి సంబంధించిన సమస్యలు, రెవెన్యూ శాఖకు రిలీఫ్ ఉత్తర్వులకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదు
- సంక్షేమ శాఖకు రిలీఫ్ లేదా ప్రత్యేక రిలీఫ్ విచారణ, మంజూరుకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదు. జ్యుడీషియల్ కోర్టు కార్యకలాపాలు, తీర్పుకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదు.
- భవీకరణ ప్రయోజనం కోసం పోలీస్ డిపార్టుమెంట్‌లో డేటా అందుబాటులో ఉంది.

ఫిర్యాదును సమర్పించిన తర్వాత బాధితుల ఫోన్‌కు సందేశం వస్తుంది. ఆ సందేశంలో అందుబాటులో ఉన్న లింక్‌తో స్టేటస్‌ను చూడవచ్చు. ఫిర్యాదుల స్టేటస్‌పై రిపోర్టులు జిల్లా కలెక్టర్లు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వద్ద అందుబాటులో ఉంటాయి.

డీఆర్ఎం కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ప్రతిఏటా నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్వే డివిజన్ డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. డీఆర్ఎం మాట్లాడుతూ రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం 2015 నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సంగా ప్రకటించడం జరిగిందన్నారు. దేశం సార్వభౌమ ప్రజాస్వామ్య లౌకిక సామ్యవాద గణతంత్ర రాజ్యమని రాజ్యంగ ప్రవేశిక వివరిస్తోందన్నారు. ఆదేశిక సూత్రాలు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజలందరికీ సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయం చేకూరాలని కోరడం జరిగిందన్నారు. భారత రాజ్యంగం పౌరులందరికీ ప్రాథమిక హక్కులు ఇవ్వడంతో పాటు నిమ్నకులాలకు బలహీన వర్గాలకు, మహిళలకు అల్ప సంఖ్యాకులకు ప్రత్యేక రక్షణ కల్పించిందన్నారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞను సంబంధిత అధికారులతో కలిసి చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధికారులు సీనియర్ డీపీఓ హనూర్, ఏడీఆర్ఎం పాల్గొన్నారు.

చట్టబద్ధమైన పాలనతో పటిష్టమైన న్యాయవ్యవస్థ

కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్



గుంటూరు ఎడ్యుకేషన్: చట్టబద్ధమైన పాలన తో పటిష్టమైన న్యాయవ్యవస్థను నెలకొల్పగలమని వైఎస్సార్ కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ పేర్కొన్నారు. సోమ వారం సాంబశివపేటలోని ఏసీ లా కళాశాలలో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని "చట్టబద్ధపాలన-రాజ్యాంగం" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ మన దేశంలో చట్టబద్ధపాలన అమలు చేయడంలో న్యాయవ్యవస్థ పటిష్టంగా పని చేస్తుందనీ, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికరణాలు, చట్టాలను చైతన్యవంతంగా అర్థం చేసుకుని ఉపయోగించుకోవాలన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ చట్టబద్ధమైన పాలనతోనే నాగరిక సమాజాభివృద్ధిని చూడగలమన్నారు. రాజ్యాంగబద్ధమైన సమాజం లేకుంటే మానవ సమాజం అధోగతి పాలవుతుందని, ఆటవిక పాలనతో ప్రజలు అనేక కష్టాల పాలవుతారని అన్నారు. చట్టబద్ధ పాలన లేకుంటే దళితులపై దాడులు మరింతగా జరిగేవన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేయడం ద్వారానే సమ సమాజం ఏర్పడి, సమాజంలోని ప్రతి ఒక్కరికీ అన్ని రంగాల్లో అవకాశాలు దక్కుతున్నాయని తెలిపారు. ఏసీ లా కళాశాల కరస్పాండెంట్ జి. ఎలీషా మాట్లాడుతూ మనుషులందరు సమానులే అనే సౌభ్రాతృత్వ భావన లేకపోతే దేశం అభివృద్ధి చెందదని అన్నారు. మహిళలు సమానత్వం సాధించడంలో దళిత స్త్రీ శక్తి చేస్తున్న పోరాటాలు చాలా అవసరమన్నారు. సభాధ్యక్షురాలు గెడ్డం ఝాన్సీ మాట్లాడుతూ మహిళలపై జరిగే అన్ని రకాల హింసను రూపుమాపేందుకు అంతర్జాతీయంగా చేపట్టిన ప్రచారోద్యమంలో భాగంగా దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు 16 రోజుల పాటు దళిత, ఆదివాసీ స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. సదస్సులో ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్ అమృతవర్షిణి, ఏఎన్‌యూ లా అసోసియేట్ ప్రొఫెసర్ సతీష్, అమల కుమారి, పలువురు న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైడ్రోజెల్ గుళికలతో వర్షాభావ పరిస్థితులకు చెక్

జిల్లా వ్యవసాయ శాఖ ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ ఎం.విజయ నిర్మల



పూసా హైడ్రోజన్ గుళికలు కలుపుతున్న అధికారులు

వేటపాలెం: మెట్ట పంటల్లో తేమను పట్టివుంచి పంటకు అవసరమైనపుడు వర్షాభావ పరిస్థితుల్లో నీటిని విడుదల చేయడానికి పూసా హైడ్రోజెల్ గుళికలు పనిచేస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ ఎం.విజయ నిర్మల పేర్కొన్నారు. మండలంలోని పాపాయిపాలెం గ్రామంలో పూసా హైడ్రోజెల్ గుళికలను వ్యవసాయ శాఖ ఆత్మ పథకం ద్వారా ప్రయోగాత్మకంగా సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పూసా హైడ్రోజెల్ గుళికలను గ్రామంలోని కరాంకి శ్రీనివాసరావు పొలంలో మినుము విత్తనాల్లో కలిపి వేశామని తెలిపారు. మినుము విత్తనాలు కిలోకి పూసా హైడ్రోజెల్‌ను ఇసుకలో కలిపి ఎకరం విస్తీర్ణంలో సమానంగా వెదజల్లుకోవాలని సూచించారు. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఆమె సూచించారు. బెట్ట పరిస్థితుల్లో పంటను పరిశీలించి ఇతర రైతుల పంట కన్నా ఎంత మెరుగ్గా దిగుబడి వచ్చిందనేది నమోదు చేస్తామని తెలిపారు. ఎంసీ ఓబయ్య, చీరాల ఏడీఏ ఎఫ్రాయిం, పి.కాశీవిశ్వనాథ్, బి.ఉమామహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

వెలకట్టలేం.. పూర్వ విద్యార్థుల సాయం

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి



ఆధునికీకరించిన లెక్చర్ గ్యాలరీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న సాయం వెలకట్టలేనిదని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి అన్నారు. సోమవారం వైద్య కళాశాలలో రూ. 15 లక్షలతో ఆధునికీకరించిన ఫోరెనిక్ మెడిసిన్ లెక్చర్ గ్యాలరీని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పాదిల ప్రసాద్ అమెరికాలో స్థిరపడి లెక్చర్ గ్యాలరీ ఆధునికీకరణ కోసం రూ. 15 లక్షలు విరాళం ఇచ్చారన్నారు. అమెరికాలో స్థిరపడిన వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతో మంది కళాశాల అభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. వైద్య కళాశాలలో జింఖానా ఆడిటోరియం, పలు వైద్య విభాగాల ఆధునీకరణ, జీజీహెచ్‌లో డాక్టర్ పాదిల ప్రసాద్ భవన నిర్మాణాలు పూర్వ విద్యార్థుల సహాయంతోనే జరిగాయన్నారు. సుమారు రూ. 80 కోట్లతో నిర్మాణం చేస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం సైతం పూర్వ వైద్య విద్యార్థుల విరాళాలతోనే జరుగుతున్నట్లు వెల్లడించారు. తాము చదువుకున్న సంస్థలో ప్రస్తుతం ఉన్న విద్యార్థులు అత్యాధునిక వైద్య సౌకర్యాలతో వైద్య విద్యను పొందాలని, ఆసుపత్రికి వచ్చే రోగులు సైతం ఆధునిక సౌకర్యాలతో వైద్య సేవలు పొందాలనే మంచి ఆశయంతో పూర్వ వైద్య విద్యార్థులు కళాశాల అభివృద్ధికి, ఆసుపత్రి అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ సుజ్ఞాన్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ జ్యోతి స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గొంతు కోసుకొని పరారీకి యత్నం

చీరాల: పట్టణంలో ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో బంగారం తాకట్టు పెట్టి, వారిని మోసగించిన వ్యక్తిని పట్టుకునేందుకు వెళ్లగా సోమవారం గొంతు కోసుకుని వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు ఓ యువకుడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. వేటపాలెం మండలం లక్ష్మీపురానికి చెందిన మల్లి రాజేష్‌పై గతంలో పలు కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది అక్టోబర్‌లో ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రూ.2 లక్షల విలువ చేసే బంగారం తాకట్టు పెట్టాడు. కొద్ది రోజులు తర్వాత బంగారం విడిపించేందుకు వెళ్లి రూ.1.20 లక్షలు కట్టి పూర్తి బంగారాన్ని విడిపించాడు. మరొకరి బంగారం అని నమ్మబలికి పూర్తి బంగారాన్ని బయటకు తీసుకొచ్చాడు. మిగిలిన నగదు చెల్లించేందుకు ఫైనాన్స్ కంపెనీ వ్యక్తి వెంట రాగా అతని కళ్లు గప్పి పరారయ్యాడు. దీంతో సంస్థ చైర్మన్ శ్రీనివాస్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే రాజేష్‌ను గుర్తించడంతో పోలీసులు వస్తారని ముందే గ్రహించి సోమవారం బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చీరాలలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు.

రజకులను టీడీపీ ఓటు బ్యాంకుగా వాడుకుంది

ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు అంజిబాబు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): తెలుగుదేశం పార్టీ రజకులను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంది తప్ప రజకులకు ఏమైనా న్యాయం చేసిందా అని ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం అరండల్ పేటలో రజక సంఘాల నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాలు మాకు బ్యాక్ బోన్ లాంటిది అని చెప్పుకునే టీడీపీ పార్టీ రజకుల ఐక్యత కోసం రజక మహాసభ ఏర్పాటు చేస్తే ఒక్క టీడీపీ నాయకులైన హాజరయ్యారా అని ప్రశ్నించారు.